కేలండర్ ఆవిష్కరణ



నూతన కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ టీకే.శ్రీదేవి, అడిషనల్ కమిషనర్ సునీత

అబిడ్స్: వాణిజ్య పన్నుల శాఖ ఎన్‌జీఓల కేంద్ర సంఘం నూతన కేలండర్‌ను కమిషనర్ టీకే. శ్రీదేవి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శాఖలోని దీర్ఘకాలిక సమస్యలను వేగవంతంగా పరిష్కరిస్తామన్నారు. అన్ని క్యాడర్ల ఉద్యోగులకు ప్రమోషన్లు ఇస్తామన్నారు. అదేవిధంగా కార్యాలయాలకు కంప్యూటర్లు, ఫర్నిచర్, ఇతర సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఏసీటీఓలకు గెజిటెడ్ హోదా అంశాన్ని పరిశీలిస్తామని కమిషనర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ సునీత, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ రహ్మత్‌అలీ, అధ్యక్షులు హరిప్రసాద్, కోశాధికారి దేవులపల్లి శ్రీనివాసరావు, ఇతర నాయకులు మధు, స్వామి, శ్రీరామ్, ముజాహిద్ పాషా, రవీంద్రబాబు, కరుణాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇన్ సర్వీస్ స్టాఫ్ నర్సులకు మళ్లీ పోస్టింగ్‌లు

- ఎన్‌ఓసీతో సంబంధం లేకుండా పోస్టింగ్‌లో చేరుతున్న ఇన్ సర్వీస్ స్టాఫ్ నర్సులు
- నిరుద్యోగ స్టాఫ్ నర్సులకు అన్యాయం

సుల్తాన్‌బజార్: తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ తెలంగాణ వైద్య విధాన పరిషత్ విభాగాలలో ప్రభుత్వం 7094 స్టాఫ్ నర్సుల పోస్టులకు జనవరి 31న 6956 మందిని ఎంపిక చేసి వారికి నియామక పత్రాలను సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రభుత్వం అందించింది. అయితే ఈ స్టాఫ్ నర్స్ నియామకాల్లో ఇన్ సర్వీస్‌లో ఉన్న కొంత మంది స్టాఫ్ నర్సులు అప్లయ్ చేసుకుని తమకు కావాల్సిన ప్రాంతాల్లో పోస్టింగ్‌లు వచ్చేలా చేసుకోవడంతో ఎంతో మంది నిరుద్యోగ స్టాఫ్ నర్సులకు అన్యాయం జరిగింది. ఇన్ సర్వీస్‌లో ఉన్న స్టాఫ్ నర్సులు తమ అనుభవంతో పోస్టింగ్‌లు తీసుకుని నిరుద్యోగ స్టాఫ్ నర్సులకు అన్యాయం చేశారని చెప్పవచ్చు. అయితే వారు పనిచేస్తున్న మాతృశాఖలో ఎలాంటి ఎన్‌ఓసీలు తీసుకోకుండా తమకు కావాల్సిన ప్రాంతంలో పోస్టింగ్‌లలో జాయిన్ అయ్యారు. తద్వారా ఎంతో కాలంగా ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న మిగతా వారికి ఎంతో అన్యాయం జరిగింది. అయితే కొంత మంది ఇన్ సర్వీస్‌లో ఉన్న స్టాఫ్ నర్సులు అధికారులను ప్రసన్నం చేసుకుని ఎన్‌ఓసీలు తీసుకువస్తుండగా మరికొంత మంది అలాగే పోస్టింగ్‌లలో జాయిన్ అవుతున్నారని మిగతా నర్సులు ఆరోపిస్తున్నారు. ఇన్‌సర్వీస్‌లో ఉండి నూతన రిక్రూట్‌మెంట్‌లో పోస్టింగ్‌లు తీసుకున్న వారికిపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే పలు నర్సింగ్ సంఘాలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం ఇన్ సర్వీస్‌లో ఉండి పోస్టింగ్ తీసుకున్న స్టాఫ్ నర్సులపై దృష్టి సారించి మిగతా నిరుద్యోగ స్టాఫ్ నర్సులకు న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైన ఉందని నిరుద్యోగ స్టాఫ్ నర్సులు కోరుతున్నారు.

రేపు సంత్ రవిదాస్ జయంతి వేడుకలు


మిత్రకృష్ణను ఆహ్వానిస్తున్న మహేష్కర్ కాంతిలాల్ చౌదరి తదితరులు

జియాగూడ: ఈ నెల 24న జియాగూడ సంజయ్‌నగర్‌లో శ్రీ సూర్యవంశీ సంత్ రవిదాస్ మోచీ సమాజ్ సేవా సంఘ్ ద్వారా 647వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు సేవా సంఘ్ చైర్మన్ మహేష్కర్ కాంతిలాల్, అధ్యక్షుడు పి.మనోహర్‌లాల్ అన్నారు. గురువారం మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..సంజయ్‌నగర్‌లోని సమాజ్ భవనంలో సంత్ రవిదాస్ విగ్రహానికి ప్రత్యేక పూజలు, సాయంత్రం బహిరంగ సభ, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ లాల్ పర్వరే, మనోహర్ లాల్ మహోరే, మనోహర్ వినయ్‌కర్, ముఖేష్ మహోరే, వినోద్ దయాల్, ఉమేష్ మహేష్కర్, గణేష్ దేవికర్, డి.తుల్జేష్, సురేష్ వినయ్‌కర్, రాజేష్ రవి, సంజీవ్ పర్వరే తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


డీఎంఈగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ వాణిని శుభాకాంక్షలు తెలుపుతున్న యూనియన్ నాయకులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ఉన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు జాలిగామ అశోక్ కోరారు. గురువారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ వాణిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. కొత్తగా ఏర్పడే మెడికల్ కళాశాలల్లో సిబ్బందిని నియమించాలని కోరారు. ఆయా సమస్యలపై త్వరలో మంత్రి దామోదర రాజనర్సింహాకు వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, రవి, రామకృష్ణ, రాఘవేందర్, అబ్బాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

‘జీహెచ్‌ఎంసీ షాప్‌ల టెండర్లలో అవకతవకలు’


వివరాలు వెల్లడిస్తున్న ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్: గోషామహల్ నియోజవర్గంలో జీహెచ్‌ఎంసీకి సంబంధించిన షాప్‌ల టెండర్లలో అవకతవకలు జరుగుతున్నాయని నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. అబిడ్స్ జీహెచ్‌ఎంసీ కార్యాలయం వద్ద ఉన్న షాప్‌లకు గత కొన్ని సంవత్సరాలుగా టెండర్లు వేయకుండా పాతవారికే కట్టబెడుతున్నారన్నారు. కోఠి కామత్ హోటల్ పక్కన, పుత్లీబౌలి, గౌలిగూడ సీబీఎస్ వద్ద ఉన్న షాప్‌లను కూడా టెండర్లు వేయకుండా లోలోపల కేటాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ ఎస్టేట్ ఆఫీసర్ బాషా, అసిస్టెంట్ స్టేట్ ఆఫీసర్ వినోద్‌లు అవకతవకలకు పాల్పడుతూ పాతవారికే షాప్‌లు కేటాయిస్తున్నారన్నారు. కొంతమంది లక్షల్లో పాతబకాయిలు ఉన్నప్పటికి వారి వద్ద వసూలు చేయడం లేదన్నారు. అవినీతి అధికారులపై ఏసీబీ ఉన్నతాధికారులకు స్వయంగా ఫిర్యాదు చేయనున్నట్లు ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. వెంటనే జీహెచ్‌ఎంసీ మార్గదర్శాల ప్రకారం టెండర్లు నిర్వహించాలని, లేనిచో జీహెచ్‌ఎంసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

గురుకుల పోస్టుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో గందరగోళం

- లైఫ్ సైన్సెస్ అభ్యర్థుల ఆందోళన
- న్యాయం చేయాలంటూ నిరసన

నాంపల్లి: గురుకుల జేఎల్ పోస్టుల నియామకాల్లో గందరగోళ వాతావరణం నెలకొంది. గడచిన మూడు రోజులుగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో గురుకుల విద్యాలయాల్లో జరిగే ఆయా కేటగిరి ఉద్యోగాల భర్తీకి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కార్యక్రమం జరుగుతోంది. బోటనీ, జువాలజీ పోస్టులకు లైఫ్ సైన్సెస్ అభ్యర్థులను అనుమతించకపోవడంతో బాధిత అభ్యర్థులు గురువారం ఆందోళన చేపట్టారు. నోటిఫికేషన్‌లో అర్హతను ఇచ్చి పరీక్ష రాశాక 1:2 పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేసి ఫలితాలను వెల్లడించారని పేర్కొన్నారు. ఫలితాలను వెల్లడించి డెమోకి అభ్యర్థులను ప్రస్తుతం డెమోకు అనుమతించకపోవడం అధికారులపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా కష్టపడి చదివి అర్హత సాధిస్తే ప్రస్తుతం ఈ విధంగా అభ్యర్థులను అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంపై అధికారులు ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు అభ్యర్థులు తెలుగు వర్సిటీ ప్రాంగణంలోనే నిరీక్షించారు. గంటల పాటు అక్కడే బైఠాయించి న్యాయం కోసం అధిక సంఖ్యలో అభ్యర్థులు హాజరై ఆందోళన చేపట్టారు. ఎలాంటి ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకోకుండా నాంపల్లి శాంతి భద్రతల పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అభిలాష్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

‘తలసేమియా సొసైటీ’కి సహకారం అందజేస్తాం


వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

చార్మినార్: తలసేమియా సికిల్ సెల్ సొసైటీకి అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తానని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ హామీ ఇచ్చారు. పాతబస్తీ శివారులోని తలసేమియా సికిల్ సెల్ సొసైటీని ఆయన గురువారం సందర్శించి అక్కడి పరిస్థితులను, తలసేమియా బాధిత చిన్నారులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఏళ్ల తరబడి తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు క్రమం తప్పకుండా అందజేస్తున్న రక్తాన్ని, ఇతర మందులను ఆయన సొసైటీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. హెచ్‌బీఏ-2 పరీక్షలను తెలంగాణలో తప్పనిసరి అంటూ ప్రత్యేక జీఓను పాస్ చేయించాలని సంబంధిత సొసైటీ ప్రతినిధులు ఎమ్మెల్యేను కోరారు. ఆయన మాట్లాడుతూ..వైద్య ఆరోగ్య శాఖ మంత్రితో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్, చీఫ్ పాట్రన్ డాక్టర్ నరేష్ రాఠీ, కార్యదర్శి డాక్టర్ సుమన్ జైన్, సంయుక్త కార్యదర్శి ఎం.ఎ.అలీం బేగ్ పాల్గొన్నారు.

‘క్రీడా’లో జాతీయ సెమినార్ ప్రారంభం


సెమినార్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

సంతోష్‌నగర్: వ్యవసాయ ఉత్పాదకతను నిలకడగా పెంపొందించడానికి జీఐఎస్, రిమోట్ సెన్సింగ్, జీపీఎస్, ఉపగ్రహాల వంటి స్పేస్ అప్లికేషన్ టెక్నాలజీలను ప్రెసిషన్ ఫార్మింగ్ కలిగి ఉంటుందని డేర్ అండ్ డీజీ, ఐసీఏఆర్ కార్యదర్శి డాక్టర్ హిమాన్షు పాఠక్ అన్నారు. సంతోష్‌నగర్ కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ (క్రీడా)లో సుస్థిర వ్యవసాయం, పర్యావరణ కోసం స్మార్ట్ టెక్నాలజీస్‌పై ఏర్పాటు చేసిన రెండ్రోజుల జాతీయ సెమినార్‌ను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అంతకు ముందు కార్యక్రమానికి అతిథులకు ఐసీఏఆర్-క్రీడా డైరెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ (వీకే)సింగ్ స్వాగతం పలికి సెమినార్ ప్రాముఖ్యతను తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ హిమాన్షు పాఠక్ మాట్లాడుతూ..వ్యవసాయంలో డ్రోన్‌ల వంటి స్మార్ట్ టెక్నాలజీ అప్లికేషన్ల కోసం ఐసీఏఆర్, భారత ప్రభుత్వం వంటి సంస్థల నుంచి నిధులు పెరిగాయన్నారు. వివిధ సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడంలో శాస్త్రవేత్తలు, ఆహార ఉత్పత్తికి సంబంధించిన ప్రతి అంశంలో విస్తరించి ఉన్నారన్నారు. ఐఎస్‌ఏపీ ప్రగతి ఫర్మానిక్ మైతీ సెక్రటరీ డాక్టర్ ప్రగతి సెమినార్ ఉద్దేశాన్ని వివరించారు. ఐఎస్‌ఏపీ అధ్యక్షులు డాక్టర్ వై.ఎస్.శివయ్ సుస్థిర వ్యవసాయం కోసం ఇండియన్ సొసైటీ ఆఫ్ ఆగ్రోఫిజిక్స్ కీలక పాత్రను వివరించారు. నార్మ్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్.శ్రీనివాస్ రైతులకు ప్రయోజనం చేకూర్చే వివిధ ఆవిష్కరణలు ప్రస్తావించారు. ఐసీఏఆర్, డీడీడీ (ఎన్‌ఆర్‌ఎం) డాక్టర్ ఎస్.కె. చౌదరి పశుపోషణ, పౌల్ట్రీ, ఫిషరీస్, ఇతర సంబంధిత రంగాలతో సహాయ వ్యవసాయంలో తాజా పురోగతులను వివరించారు.

‘అధిష్టానం ఆదేశిస్తే పోటీ చేస్తా’


అమర్‌సింగ్

గోల్కొండ: అధిష్టానం ఆదేశిస్తే హైదరాబాద్ పార్లమెంటు స్థానానికి పోటీ చేస్తానని కార్వాన్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ అన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉందని అంతేకాకుండా స్థానికంగా అందరితో సత్‌సంబంధాలు ఉన్నాయని ఆయన అన్నారు. 40 ఏళ్లుగా తాను రాజకీయాల్లో ఉంటూ సేవ చేస్తున్నానని అన్ని వర్గాల ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు. సుదీర్ఘ కాలంగా బీజేపీ నాయకుడిగా ఉన్న తనకు హైదరాబాద్ ఎంపీగా గెలిపిస్తారని ఆయన అన్నారు.

సెట్విన్ కోర్సులకు దరఖాస్తు చేసుకోండి


వేణుగోపాల్‌రావు, సెట్విన్ ఎండీ

యాకుత్‌పురా: ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఇటీవల ప్రవేశపెట్టిన నూతన కోర్సులతో పాటు రెగ్యులర్ కోర్సుల్లో శిక్షణ పొందేందుకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ రంగ సెట్విన్ శిక్షణ సంస్థ ఎండీ కే.వేణుగోపాల్ రావు తెలిపారు. గురువారం పురానిహవేలిలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ కలిగి ఉన్న బేసిక్ బయో మెడికల్ ఇక్విప్‌మెంట్ టెక్నీషన్, ప్లంబింగ్, టూల్స్ అండ్ కంపోనెంట్స్, ఫైర్ అలారం కంట్రోలర్, స్మోక్ డిటెక్టర్స్ కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన 3 నెలల కాల పరిమితి గల ఈ కోర్సులను ప్రస్తుతం మోతీగల్లీ శిక్షణ కేంద్రంలో అందుబాటులోకి ఉంచమన్నారు.

‘నియామకాల సిఫారస్ పత్రాలను అమ్ముకోవడం దుర్మార్గం’


కృష్ణంరాజు

గన్‌ఫౌండ్రీ: పాతబస్తీలోని పలు ఆలయాల పాలకవర్గ సభ్యుల నియామకాల సిఫారస్ పత్రాలను కొంత మంది వ్యక్తులు వేలాది రూపాయలకు అమ్ముకుంటున్నారని హిందూ ఏక్తా ఆందోళన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు ఆరోపించారు. గురువారం బషీర్‌బాగ్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..పాతబస్తీ పరిధిలోని పలు ఆలయాలు దేవాదాయశాఖ పరిధిలో ఉన్నాయని, ఆ దేవాలయాల్లో సభ్యుల నియామకం కోసం గందరగోళం సృష్టిస్తున్నారని తెలిపారు. దేవాలయాల పాలకవర్గ సభ్యుల నియామకం కోసం డబ్బులను వసుళ్లు చేయడం దుర్మార్గమన్నారు.

ఇద్దరికి జైలు శిక్ష

గౌలిపురా: పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు ఛబుత్రాలపై కూర్చొని మద్యం, సిగరేట్లు సేవిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్న ఇద్దరిని పోలీసులు గురువారం నాంపల్లిలోని 4వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ నిందితులకు మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం..భవానీనగర్ తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన మహ్మద్ మజ్హర్ (24), మహ్మద్ పాషా (19)లు స్టేషన్ పరిధిలోని ఛబుత్రాలపై అనుమానాస్పదంగా కూర్చొని మద్యం, సిగరేట్లు సేవిస్తున్నారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకోగా పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో వారితో దురుసుగా ప్రవర్తించారు. దీంతో వారిద్దరిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసుకొని గురువారం కోర్టులో హాజరు పరచగా పూర్వ పరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ సత్యానారాయణ నిందితులిద్దరికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

రెండో అంతస్తు నుంచి పడి సెంట్రింగ్ కార్మికుడు మృతి

బహదూర్‌పుర: ప్రమాదవశాత్తు రెండో అంతస్తు నుంచి పడి ఓ సెంట్రింగ్ కార్మికుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన కాలాపత్తర్ పోలీస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీశైలం తెలిపిన వివరాల ప్రకారం..తలాబ్‌కట్ట ప్రాంతానికి చెందిన సయ్యద్ నసీబ్(34) సెంట్రింగ్ కార్మికుడు. మోచీకాలనీ ఇంద్రానగర్‌లో ఓ ఇంటి నిర్మాణం జరుగుతోంది. గురువారం రెండో అంతస్తుపై పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. దీనికి సంబంధించి కేసు నమోదు చేసుకున్న కాలాపత్తర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

‘యువ రెజ్లర్లకు మజ్లిస్ అండగా ఉంటుంది’


టైటిల్ గెలిచిన మహ్మద్ ఇబ్రహీంతో ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

గోల్కొండ: యువ రెజ్లర్లకు తమ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. ఇటీవలే జరిగిన సాలారే మిల్లత్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ సాధించిన మహ్మద్ ఇబ్రహీంను గురువారం గోల్కొండ మహ్మదీ లైన్స్‌లోని ఎంజేపీ డైరీ ప్రొడక్ట్స్ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా మహ్మద్ ఇబ్రహీం తాను గెలిచిన బంగారు గదను ఎమ్మెల్యేకు చూపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మజ్లిస్ పార్టీ ప్రతి యేటా ఎన్నో రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తుందన్నారు. నియోజకవర్గంలోని పేద విద్యార్థులకు మజ్లిస్ పార్టీ ఎంతో సహాయం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మజ్లిస్ నాయకుడు యామీన్ ఖాన్, ఎంజేపీ డైరీ ప్రొడక్ట్స్ అధినేత మహ్మద్ గౌస్, కంపెనీ ప్రతినిధులు తదితరులున్నారు.

జర్నలిస్టులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


ప్రొ.మహ్మద్ ఫరీయాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: జర్నలిస్టులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మౌలానా ఆజాద్ ఉర్దూ జాతీయ విశ్వవిద్యాలయం జర్నలిజం మాస్ కమ్యూనికేషన్ విభాగం డీన్ ప్రొఫెసర్ మహ్మద్ ఫరీయాద్ అన్నారు. గురువారం టోలిచౌకీ సాలార్‌జంగ్ కాలనీలో సాప్ కిడ్నీ సెంటర్‌లో జర్నలిస్టులకు నిర్వహించిన కిడ్నీ అవేర్‌నెస్‌లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. జర్నలిజం వృత్తిలో ఉన్న వారు ఒత్తిడికి గురవడం సహజమేనని శారీరకమైన ఒత్తిడి వల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. సాప్ కిడ్నీ సెంటర్ నెఫ్రాజలిస్ట్ డాక్టర్ షోహేబ్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ.. శరీరంలో కిడ్నీలు అత్యంత ముఖ్యమైనవన్నారు. ఒకసారి కిడ్నీ పాడవుతే శరీరం ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొంటుందని ఇతర రోగాలు సైతం సోకే ప్రమాదం ఉంటుందన్నారు. సాప్ మెడికల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నియాజ్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల కోసం తాము క్రమం తప్పకుండా కిడ్నీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు ఎం.ఏ.మాజిద్, డాక్టర్ హాఖిబ్ అహ్మద్ ఖాన్, సత్యనారాయణ, డాక్టర్ ఆసీఫ్ తదితరులున్నారు.

ఇసామియాబజార్‌లో ఖాళీ స్థలాన్ని సర్వే చేయాలి

సుల్తాన్‌బజార్: గోషామహల్ నియోజకవర్గం గన్‌ఫౌండ్రీ డివిజన్ ఇసామియాబజార్‌లోని మేఘ్‌రాజ్‌భవన్ సమీపంలో ఉన్న ఖాళీ స్థలాన్ని ప్రభుత్వం సర్వే చేయించాలని గోషామహల్ నియోజకవర్గం డెవలప్‌మెంట్ ఫోరం ప్రతినిధి బద్దం సతీష్‌గౌడ్ కోరారు. హైదరాబాద్ ఆర్‌డీఓగా బాధ్యతలు చేపట్టిన వెంకట్‌రెడ్డిని డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో సత్కరించి స్వామి వివేకానంద మెమొంటు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఇసామియాబజార్‌లో ఉన్న ఖాళీ స్థలం ప్రభుత్వానిదా లేకా ప్రైవేటు స్థలమా అని గుర్తించాలని కోరారు. ఫోరం నాయకులు శ్రీనివాస్ యాదవ్, నాగభూషణం చారి, శ్యామ్, రాజేష్, రాధాకృష్ణ తదితరరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు చైర్మన్‌కు సన్మానం


అజ్మతుల్లా హుస్సేనీని సన్మానిస్తున్న డాక్టర్ ఎస్‌ఎం.ముజీబ్ హుస్సేనీ

అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు నూతన చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీని హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌ఎం.ముజీబ్ హుస్సేనీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గురువారం ముజీబ్ హుస్సేనీ ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అజ్మతుల్లా హుస్సేనీ ఆధ్వర్యంలో వక్ఫ్‌బోర్డు మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అదేవిధంగా వక్ఫ్‌బోర్డులో ఉన్న సమస్యలు వేగవంతంగా పరిష్కారం అవుతాయన్నారు. అజ్మతుల్లాను చైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేఆర్.రాజ్‌కుమార్, నాయకులు ఖలీద్ అహ్మద్, వైదిక్ శాస్త్రి, బి.శంకర్, ముఖీమ్ ఖురేషి, సయ్యద్ ఇబ్రహీం, సయ్యద్ అసద్ హుస్సేని, తిర్మీజీ జబ్బార్, అబ్దుల్ ఖాదర్, హయుం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా అభ్యున్నతితో సామాజిక అభివృద్ధి సాధ్యం

గన్‌ఫౌండ్రీ: మహిళా అభ్యున్నతితో సామాజిక అభివృద్ధి, న్యాయం సాధ్యమవుతుందని విశ్రాంత ఐఎఫ్ఎస్ వినోద్‌కుమార్ అన్నారు. గురువారం సైఫాబాద్‌లోని అంబేడ్కర్ రిసోర్స్ సెంటర్‌లో దళిత స్త్రీ శక్తి 18వ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత, ఆదివాసి స్త్రీలు-సామాజిక న్యాయం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..భారతదేశ రాయబారిగా మన దేశం గురించి ఎంతో గొప్పగా చెప్పేవాడినని కానీ నిజంలో చూస్తే ఇక్కడా మతం, కులం పేరుతో మనువాదం రాజ్యమేలుతూ విజృంభిస్తుందన్నారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం, కుటుంబ హింస నుంచి మహిళల రక్షణ చట్టం, దళిత స్త్రీ శక్తి వార్షిక నివేదిక పుస్తకాలను ఆవిష్కరించారు. దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ, వైద్య నిపుణులు డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ పద్మాకర్ పాల్గొన్నారు.

మరణంలోనూ మానవత్వం

మృతిచెందిన మహిళ అవయవాలతో ఆరుగురికి పునర్జన్మ


సోనం విజయవర్గి (ఫైల్)

అఫ్జల్‌గంజ్: కుటుంబీకురాలు మృతి చెందిన పుట్టెడు దుఃఖంలో ఉన్నా ఆమె అవయవాలు దానం చేసేందుకు ముందుకురావడం ఎంతో అభినందనీయమని ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ అన్నారు. హుస్సేనీఆలం, కోకబజార్‌కు చెందిన రూపేశ్ విజయ వర్గి భార్య సోనం విజయ వర్గి (34) రెండు రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో నగరంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్లారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో ఆమె బ్రెయిన్ డెడ్ అయ్యిందని వైద్యులు నిర్ధారించారు. ఉస్మానియాకు తీసుకెళ్లాల్సిందిగా సూచించారు. జీవన్‌దాన్ సంస్థ ప్రతినిధులు ఉస్మానియా వైద్యులు, మృతురాలి కుటుంబసభ్యులతో సంప్రదించారు. ఆమె అవయవాలు దానం చేసేందుకు కుటుంబీకులు ముందుకు వచ్చారు. ఈనెల 21న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, వైద్యులు నాగప్రసాద్, మధుసూధన్, త్రివేణి, వివిధ విభాగాల వైద్యుల స్వీయ పర్యవేక్షణలో మహిళ దేహం నుంచి అవయవాలు సేకరించారు. వరంగల్ జిల్లాకు చెందిన 13 ఏళ్ల బాలిక కాలేయ సమస్యలతో బాధపడుతూ కొన్ని రోజులుగా ఉస్మానియాలో చికిత్స పొందుతుంది. మహిళ నుంచి సేకరించిన కాలేయాన్ని బాలికకు అమర్చి మార్పిడి శస్త్ర చికిత్సను పూర్తి చేశారు. రెండు మూత్రపిండాలను నిమ్స్ ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్న రోగులకు అమర్చేందుకు తరలించారు. రెండు కళ్లను సరోజిని దేవి కంటి ఆస్పత్రికి, చర్మాన్ని ఉస్మానియాలో చర్మనిధి కేంద్రంలో భద్రపర్చారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి


డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

గన్‌ఫౌండ్రీ: మాదకద్రవ్యాల నియంత్రణకు ఎక్సైజ్ శాఖ అధికారులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం రవీంద్రభారతిలో ఎక్సైజ్ శాఖ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గంజాయి, మద్యం అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నార్కోటిక్స్ నియంత్రణకు బహుముఖ వ్యూహం అవలంభించడంతో పాటు ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలను త్వరలోనే అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జె.హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి విజయ్, కార్యదర్శి డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యరత్న అవార్డుల ప్రదానం


అవార్డు గ్రహీతలతో జస్టిస్ నంద

గన్‌ఫౌండ్రీ: వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేపల్లి నంద అన్నారు. గురువారం రవీంద్రభారతిలో మదర్ ఫౌండేషన్ 15వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులకు వైద్యరత్న అవార్డులను ప్రదానం చేశారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది డీఎల్ పాండు, వైద్య నిపుణులు డాక్టర్ ఆశీష్ చౌహాన్, మదర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మల్లికార్జున్ రావు, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

సొంత గూటికి చేరిన జుర్కీ రాజేందర్



చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు జుర్కీ రాజేందర్ తిరిగి కాంగ్రెస్ గూటికి చేరుకున్నాడు. జీహెచ్‌ఎంసీ మాజీ మేయర్, కాంగ్రెస్ నేత బొంత రామ్మోహన్ సమక్షంలో గురువారం పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా జుర్కీ రాజేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు నెలల్లోనే తన మార్క్ చూపించారన్నారు. రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా చేసేందుకు ప్రతి కార్యకర్త అంకిత భావంతో పని చేయాలన్నారు.

ఓటరు లిస్టులో తప్పులను సరి చూసుకోండి



చార్మినార్: ఓటరు లిస్టులో ఏవైనా తప్పులు దొర్లితే మరోసారి సరి చూసుకోవాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్-9 డిప్యూటీ కమిషనర్ సరిత వివిధ రాజకీయ పార్టీల నాయకులను కోరారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని ఓటరు లిస్టుల పరిశీలన తదితర అంశాలపై చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీతో కలిసి మొగల్‌పురాలోని తన కార్యాలయంలో అఖిల పక్ష పార్టీల సమావేశం నిర్వహించారు. ఈ నెల 8న వెలువడిన ఎలక్టోరల్ డ్రాఫ్టింగ్ రోల్‌పై ఏవైనా అభ్యంతరాలు ఉంటే తన దష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. పత్తర్‌గట్టి కార్పొరేటర్ సుహేల్ ఖాద్రీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మీర్ హైదర్ అలీ జాఫ్రీ పాల్గొన్నారు.

‘ఎంపీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు గుణపాఠం తప్పదు’


మాట్లాడుతున్న గౌరీ సతీష్

అబిడ్స్: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో మరోసారి బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు గుణపాఠం తప్పదని రాష్ట్ర పీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ పేర్కొన్నారు. పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలు ప్రజలను నట్టేట ముంచాయన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం ప్రజలకు మాయమాటలు చెప్పి రాష్ట్రాన్ని దోచుకున్నారన్నారు. ఒకొక్కటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ అవినీతి బయటపడుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ రాబోయే ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందన్నారు.

యువతిపై అత్యాచారానికి పాల్పడిన యువకుడి అరెస్టు

నాంపల్లి: మాయ మాటలు చెప్పి 22 ఏళ్ల యువతిపై అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోనికి వచ్చింది. అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని హబీబ్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం... ఆగాపురాకు చెందిన మహ్మద్ షాబాజ్ (36) మటన్ వ్యాపారి. కోఠిలో వ్యాపారం చేస్తూ దివాలా తీశాడు. ఈ క్రమంలో ఆగాపుర టేక్డీ మసీదు దగ్గర ఉండే ఓ టిఫిన్ సెంటర్ వద్దకు నిత్యం టిఫిన్ చేసేందుకు వచ్చేవాడు. టిఫిన్ సెంటర్ పక్కనే ఉన్న నోవా క్లినిక్‌లో హౌస్ కీపింగ్ చేస్తున్న 22 ఏళ్ల యువతితో అతడు పరిచయం పెంచుకున్నాడు. తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోవడంతో తన పెద్దమ్మ దగ్గర ఆమె ఉంటోంది. 15 రోజుల క్రితం ఆ యువతి మెడికల్ షాపునకు నడుచుకుంటూ వెళ్తుండగా షాబాజ్ ఆమెకు అడ్డు తగిలాడు. ఆమెకు మాయ మాటలు చెప్పి బైక్‌పై ఎక్కించుకుని నెక్లెస్ రోడ్ పార్కు వైపు వెళ్లాడు. అయితే కొన్నాళ్లుగా మటన్ వ్యాపారంలో నష్టం రావడంతో రూ.30వేలు ఇవ్వాల్సిందిగా ఆమెను కోరాడు. డబ్బులు ఇవ్వకుంటే నెక్లెస్ రోడ్డు పార్కులో దిగిన ఫొటోలు బంధువులందరికీ చూపెడుతానని భయపెట్టాడు. ఆందోళనకు గురైన యువతి కొన్ని డబ్బులు అతనికి ఇచ్చింది. బాధితురాలి పెద్దమ్మ ఇంట్లో దాచిన డబ్బులు కనిపించకపోవడంతో ఆమెను డబ్బులెక్కడని బంధువులు నిలదీయగా అసలు విషయం బయటపడింది. బాధితురాలు తన కుటుంబ సభ్యులతో కలిసి షాబాజ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అత్యాచారానికి పాల్పడిన షాబాజ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.